ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024
5
అల్లూరి సీతారామరాజు



ప్రతి నెలా మూడో శుక్రవారం
ఉద్యోగ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -పాడేరు: ఇక నుంచి ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని శాఖల ప్రధాన అధికారులకు సర్క్యులర్ జారీ చేస్తూ, వారికింది సిబ్బందికి సమాచారం చేరవేయాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ నెలలో మూడవ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇది వరకు ప్రకటించినట్లు నాల్గవ శుక్రవారం బదులుగా మూడవ శుక్రవారానికి మార్పు చేశామని,అధికారులు, సిబ్బంది గమనించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఉద్యోగులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు.

నిలకడగా గోదావరి



తమ ఇళ్లను చూసుకునేందుకు పునరావాస కేంద్రాల నుండి స్వగ్రామాలకు వరద నీటిలో వెళ్తున్న బాధితులు

ప్రజాశక్తి-ఎటపాక

15 రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి బుధవారం స్వల్పంగా 2 అడుగులు పెరిగి నిలకడగా ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మంగళవారం సాయంత్రానికి 42.9 అడుగుల ఉండగా, బుధవారం సాయంత్రానికి 45 అడుగులకు చేరింది. మురుమురు వద్ద కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై వరద నీరు ఇంకా నిలిచి ఉండడంతో ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కూనవరం వెళ్లాల్సిన వాహనదారులు మురుమూరు- పోలిపాక గ్రామాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. అటు నెల్లిపాక - వీరాయిగూడెం గ్రామాల మధ్య వరద నీరు నిలిచి ఉండడంతో విరాయగూడెం గ్రామస్తులు నరసింగపేట మీదుగా ప్రయాణ సాగిస్తున్నారు. అయితే గోదావరి తగ్గడంతో ఎటపాక మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి.

విఆర్.పురం : గోదావరి వరద ఉధృతి తగ్గినా మండలంలోని ముంపు గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. రహదారులు వరద నీటి నుండి బయటపడలేదు. మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ వడ్డిగూడెంకాలనీ, ధర్మ తాళగూడెం, శ్రీరామగిరి పంచాయతీ శ్రీరామగిరి, చొక్కనపల్లి, కల్తునూరు, చిన్న మట్టపల్లి పంచాయతీ కన్నాయి గూడెం, చింతరేగుపల్లి, సృష్టివారి గూడెం, గుండు గూడెం, రామవరం పంచాయతీ రామవరం, అడవి వెంకన్నగూడెం, చొప్పల్లి, తుమ్మిలేరు పంచాయతీ కొల్లూరు, గొందూరు, కొండెపూడి, కోటారి గొమ్ము, పోచారం, జీడిగొప్ప పంచాయితీ ములకనపల్లి, జీడిగుప్ప, ఇసునూరు తదితర గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. రేఖపల్లిలో గుడారాలు వేసుకొని ఉన్న ముంపు గ్రామాల ప్రజలు బుధవారం పడవల్లోనూ, కాలినడకన తమ గ్రామాలకు వెళ్లి ఇళ్లను శుభ్రం చేసుకొని మళ్లీ గుడారాల వద్దకు చేరుకున్నారు. 14 రోజుగా నీటిలో ఉన్న తమ ఇళ్లు పడిపోయే పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఈ బాధలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

కూనవరం : వరద ఉధృతి తగ్గినా మండలంలోని పలు గ్రామాలు ఇంకా మంపులోనే ఉన్నాయి. సుమారు వారం రోజులుగా మండలంలోని కూనవరం, టేకులబోరు ప్రజలు పునరావాస కేంద్రాల్లోనూ, శబరి కొత్తగూడెం, కొండ్రాజుపేట వంటి గ్రామాల ప్రజలు ఎగువ ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని ఉంటున్నారు. బొజ్జరాయి గూడెం నుండి కోడేరు మధ్యలో నీరు నిలిచి మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వరద దాటికి పోలిపాక వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

వరద ఆర్థిక సాయం పంపిణీ


విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ పరిధిలోని జల్లివారి గూడెం, ముల్కనపల్లి గ్రామాలలో వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం బుధవారం సర్పంచ్ సవలం మారయ్య చేతుల మీదుగా బాధితులకు రూ.3వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రహదారులు లేక, సరుకులు తెచ్చుకోవడానికి డబ్బులు లేక, పనులు లేక సగం ఆకలితో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటివారికి రూ.3వేలు ఆర్థిక సాయం ఏమాత్రం సరిపోదన్నారు. కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు లేవని, వారికి కూడా వరద ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, సచివాలయం సిబ్బంది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని పెద మట్టపల్లిలో 915 కుటుంబాలు, చిన్న మట్టపల్లిలో 1216 కుటుంబాలు, ములకనపల్లి 655 కుటుంబాలు, కుందులూరు 503 కుటుంబాలు, శివారు గ్రామాల ప్రజలు 3,289 కుటుంబాలకు ప్రభుత్వ వరద సాయం రూ.3వేలు చొప్పున ప్రజా ప్రతినిధులు, ఫ్లడ్ కమిటీల సమక్షంలో పంపిణీ చేశారు. వడ్డిగూడెం, విఆర్ పురం, ధర్మతాళ్ల గూడెం గ్రామాల్లో 1939 కుటుంబాలకు 25 కేజీ చొప్పున బియ్యం అందించారు. మండలంలోని మిగిలిన గ్రామాలకు గురువారం పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కూనవరం : ముంపు బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు చొప్పున మండలంలోని లింగాపురం, రేగులపాడు గ్రామాల్లో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ సోడే శంకర్ పంపిణీ చేశారు. పెదఆర్కూర్ గ్రామంలో ఎంపిటీసీ అమ్మాజీ, సర్పంచ్ నాగమణి బాధితులకు అందించారు. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి శివకుమార్, మోహన్, ప్రవీణ్, కూనవరంలో టీడీపీ మండల అధ్యక్షులు భరపాటి ప్రకాష్, చెలికాని ఉమా, దాసరి నరేంద్ర పాల్గొన్నారు.



వరద సాయం అందిస్తున్న కూనవరం వైస్ ఎంపిపి పెంటయ్య



విఆర్.పురం మండలం ములకనపల్లిలో సాయం అందిస్తున్న సర్పంచ్ మారయ్య

ముంపులోనే ఉన్న విఆర్.పురం, కూనవరం మండలాల్లోని గ్రామాలు

వరద సాయం కోసం బారులు తీరిన బాధితులు

- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-ఎటపాక : వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు వరద సాయం కోసం బుధవారం మండలంలోని నందిగామ గ్రామంలో బాధితులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వరద సాయం కోసం రేషన్ కార్డుదారులంతా పేర్లు నమోదు చేయించుకోవాలని విఆర్‌ఓ తెలపగా గ్రామస్తులు, మహిళలు, వృద్దులు సచివాలయం ఎదుట బారులు తీరారు. అయితే డబ్బులు ఈ రోజు పంపిణీ చేయడం లేదని, పేర్లు మాత్రమే నమోదు చేస్తున్నట్లు వీఆర్వో చెప్పడం వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయల కోసం ఒకసారి, రేషన్ బియ్యం కోసం ఒకసారి పేర్లు నమోదు చేసుకోగా, ఇప్పుడు సాయం కోసం మరోసారి పేర్లు నమోదు చేసుకోవడం ఎందుకని, గతంలో నమోదు చేసుకున్న ప్రకారం ఇవ్వొచ్చుకదా? అని వారు ప్రశ్నించారు. ఇన్ని ఇబ్బందులు పడుతూ బతుకంత క్యూ లైన్లలోనే ఉండాల్సిందేనా అంటూ మండిపడ్డారు. గోదావరి వరదల కారణంగా పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ఇప్పుడు కాస్త పనులు దొరికే సమయంలో పేర్లు నమోదు కోసం ఒకరోజు, నగదు తీసుకోడానికి మరో రోజు పనులు మానేయాల్సిన పరిస్థితి ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రక్షిత మంచినీరు ట్యాంకు క్లీనింగ్

చింతూరు : చింతూరు మండలం కుమ్మూరు గ్రామపంచాయతీలోని కురసం గుంపు వద్ద పంచాయతీ సిబ్బంది చేపట్టిన ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌లోకి క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్ పనులను బుధవారం రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి జిఎల్ఎన్‌వి రాఘవన్ పరిశీలించారు. పనులు సంతృప్తికరంగా లేకపోవడంతో సంబంధిత పంచాయతీ సిబ్బందికపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్ పనులు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ సిబ్బంది తక్షణమే ట్యాంకులు శుభ్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు.



వాటర్ ట్యాంకులోకి దిగి క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న డిపిఒ రాఘవన్



డోలిమోత ద్వారా గోపన్నను వాగు దాటిస్తున్న బంధువులు

డోలి కట్టి.. వాగు దాటించి..

- అనారోగ్యానికి గురైన వ్యక్తిని ఆసుపత్రికి తరలింపు
- వాగు ఉధృతి కారణంగా వారం రోజులు ఆలస్యంగా తీసుకొచ్చిన బంధువులు
- చింతపల్లి ఆసుపత్రికి రిఫర్ చేయడంతో.. స్వగ్రామానికి తీసుకెళ్లిపోయిన వైనం

ప్రజాశక్తి-సీలేరు

ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో గర్భిణులు, అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రికి తరలించాలంటే నేటికీ డోలిమోతలే దిక్కు. అందులోనూ వర్షా కాలంలో వాగులు పొంగి ప్రవహించే సమయంలో ఆ డోలిమోతల ద్వారా కూడా ఆసుపత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి. వాగుల ఉధృతి తగ్గిన తరువాతే ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి. ఇటువంటి సంఘటనే జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామంలో చోటుచేసుకుంది. నిమ్మచెట్టు గ్రామానికి చెందిన 60 ఏళ్ల పాంగి గోపన్న వారం రోజుల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భారీ వర్షాలు కారణంగా వాగులు ప్రమాదకరంగా పొంగి ప్రవహించాయి. నిమ్మచెట్టు చెక్ డ్యామ్ నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో దారకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దీంతో గోపన్న ఆరోగ్యం మరింత క్షీణించింది. ఎట్టకేలకు నిమ్మచెట్టు చెక్ డ్యామ్ నుంచి నీటి ప్రవాహం బుధవారం నాటికి తగ్గు ముఖం పట్టింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు బుధవారం డోలికట్టి గోపన్నను దారకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించిన వైద్యులు మెరుగైన వైద్య సేవ నిమిత్తం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే గోపన్నను చింతపల్లి తీసుకెళ్తే.. ఒకవేళ అక్కడే మృతి చెందితే అటు నుంచి తమ గ్రామానికి తీసుకురావడానికి తమకు ఆర్థిక స్తోమత లేదని చింతపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు నిరాకరించారు. గోపన్న కుటుంబ సభ్యులు ఆయన్ను తిరిగి వారి స్వగ్రామానికి డోలీమోతతో తరలించారు. అనంతరం గోపన్నకి నాటు వైద్యం చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రేషన్ కార్డుల్లేని కుటుంబాలకు వరద సాయం అందించాలి : సిపిఎం

ప్రజాశకి-విఆర్.పురం : ముంపు గ్రామాల్లోని అన్ని కుటుంబాలు వరద బారిన పడి అవస్థలు ఎదుర్కొంటున్నారని, కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు లేవని, వారికి కూడా ప్రభుత్వం ప్రకటించిన వరద సాయం అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు రేషన్ కార్డులున్న వరద బాధిత కుటుంబాలకు రూ.3వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారని, అయితే ఇటీవల కొత్తగా పెళ్లి అయి కుటుంబాలుకు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వారికి కూడా వరద సాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో చిన్న మట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, గుండెపూడి లక్ష్మణరావు, తోడం రాజు, ఆత్మకూరి కాంతారావు, తుర్రం బాబూరావు, కారం సత్తిబాబు, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ హాస్టళ్లకు వంటగ్యాస్ ఇవ్వాలి



హాస్టల్ వర్కర్లతో కలిసి ఖాళీ గ్యాస్ బండలను పరిశీలిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లకు నాలుగు నెలల నుంచి ఉచిత గ్యాస్ నిలుపుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ ఆరోపించారు, బుధవారం పలు ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లను సందర్శించారు. హాస్టల్ వర్కర్ల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గతంలో ఐటిడిఎ నుంచి ఉచితంగా వంటగ్యాస్ ఇచ్చేవారని, ఇప్పుడు నాలుగు నెలలుగా నిలుపుదలతో వార్డెన్లపై అదనపు భారం పడుతోందన్నారు. ఒక్కొక్క హాస్టల్‌లో 200 నుంచి 700 వరకు పిల్లలు ఉన్నారని, రోజు రెండు నుంచి మూడు గ్యాస్ సిలిండర్లు వంట కోసం అవసరమౌతుందని, ఈ నేపథ్యంలో నెలకు వంటగ్యాస్‌కు రూ.లక్ష వరకు వార్డెన్లు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లకు వంటగ్యాస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

కుమ్మరిపుట్టు గెడ్డపై వంతెన నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర
- నాటుపడవలో ముంపు బాధిత గ్రామాల సందర్శన
- తక్షణం స్పందించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : మండలంలోని కుమ్మరిపుట్టు గెడ్డపై వంతెనను నిర్మించి, 15గ్రామాల ప్రజల ముంపు, రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన గ్రామాల పర్యటనలో భాగంగా కుమ్మరిపుట్టు వద్ద గెడ్డపై నాటుపడవలో ప్రయాణించి ఆవతల వైపునకు వెళ్లారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, సాగునీటి సౌకర్యం కల్పనలో భాగంగా బ్రిటీషర్ల హయాంలో జోలాపుట్టు రిజర్వాయర్ నిర్మించిన నాటి నుంచి దారెల, పెదగూడ, సుజనకోట, పనసపుట్టు, జోలాపుట్టు, మాకవరం పంచాయతీల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు నీటిముంపు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్నప్పటికీ, కుమ్మరిపుట్టు వద్ద గెడ్డపై వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి కలగానే ఉండిపోయిందని, దీంతో 15గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సీజన్‌లో ఉధృతంగా ప్రవహించే గెడ్డను దాటేందుకు నాటు పడవలను ఉపయోగిస్తూ, అనేక పర్యాయాలు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయన్నారు. వర్షాల సీజన్‌లో కుమ్మరిపుట్టు గెడ్డకు అకాల వర్షాలు సర్వసాదారణమని, దీంతో గెడ్డపై నాటు పడవ ప్రయాణంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, గడచిన 15ఏళ్లలో 20మందికి పైగా ఇలాగే మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో దాదాపు ఆరునెలల పాటు గెడ్డలో నీటి ప్రవాహం ఉధృతంగానే ఉంటుందని, నిత్యవసరాలతోపాటు, అత్యవసర వైద్యం, ఇతరత్రా పరిస్థితుల్లో నాటు పడవలే శరణ్యమన్నారు. అంతేకాక జోలాపుట్టు రిజర్వాయర్‌లో కొంచం నీటిమట్టంపెరిగినా 15 గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. గర్భిణుల, బాలింతలు, జ్వరపీడితులు నానా అగచాట్లు పడక తప్పడం లేదన్నారు. గతంలో వంతెన నిర్మాణానికి రూ.పది కోట్ల తో ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర మోటారు బోట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా అదీ నేటికీ సాకారం కాలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్, ఇతర అధికారులతోపాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు జోలాపుట్టు రిజర్వాయర్, కుమ్మరిపుట్టు గెడ్డతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించి, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. గిరిజనుల ప్రాణాల రక్షణకు, తాత్కాలికంగా సురక్షిత రాకపోకలకు వీలుగా ఇంజిన్ పడవలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై తక్షణం స్పందించకుంటే మరోమారు బాధిత గిరిజనులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, మండల నాయకులు ఎం.ఎం.శ్రీను, ఎస్. గాసిరం దొర, కుమ్మరపుట్ గ్రామస్తులు పాల్గొన్నారు.



గతంలో కుమ్మరిపుట్టు సందర్శనలో సిపిఎం బృందం



కుమ్మరిగెడ్డలో నాటు పడవలో వెళుతున్న సురేంద్ర, ఇతర సిపిఎం నేతలు

సిసి రోడ్డు నిర్మించాలని ఆందోళన

నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంపై నిరసన



ఆందోళన చేస్తున్న అడపవలస గిరిజనులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంజూరైన సిసి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని బుధవారం ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు. టి సూర్యనారాయణ మాట్లాడుతూ 2023లో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యర్యంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో అడపవలస గ్రామంలో 400 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.6.75లక్షలు మంజూరు చేశారన్నారు..గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభంచక పోవడంతో గ్రామంలో వెళ్లే వీధి రోడ్డు వర్షకాలంలో బురదమయమై ప్రజలు ఇబ్బందులు పడుఉతున్నారన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా అప్పట్లో మంజూరైన నిధులతో అడపవలసలో సిసి రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో.వార్డ్ సభ్యుడు రమేష్ , కె సీతారాం, శేఖర్ బాబు పాల్గొన్నారు.

మ్యూజియం నిర్మాణం వేగవంతం చేయండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం
- బెన్నవరం వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు.




బెన్నవరం వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి. -చింతపల్లి: స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం చింతపల్లి మండలం తాజంగి సమీపంలో రూ. 35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మ్యూజియం పనులను పరిశీలించారు. మ్యూజియం నిర్మాణ విధానాన్ని అధికారులు పవర్ పాయింట్ ద్వారా జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు పనులకు కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని ఆదేశించారు. నిమ్యూజియం నిర్మాణంలో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అంతకుముందు బెన్నవరం గ్రామ సమీప వంతెనను సందర్శించి పరిశీలించారు. వంతెన నిర్మాణానికి ఏఐబి గ్రాంట్ కింద రూ. 2 కోట్లు నిధులు మంజూరైందన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అనూషాదేవి, జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్‌ఎం రాజు, డిఇఇ టి.చాణక్యరావు, ఎఇఇ యాద కిషోర్, చింతపల్లి తహశీల్దార్ ఇ.రామకృష్ణ, ఎంపిడిఓ వి వీరసాయిబాబు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులుపాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జి.మాడుగుల: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కుంబిడిసింగి, బోనంగి కల్వర్టులను ఐటిడిఎ పిఒ వి.అభిషేక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ బుధవారం పరిశీలించారుదెబ్బ తిన్న కల్వర్టుల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మండలంలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు కూలిపోయిన ఇళ్లను వివరాలను సేకరించాలని సూచిచారు. గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్‌ఎం.రాజు, తాహసిల్దార్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్, పిఒ

పాఠశాల భవనం నిర్మించరూ..?

గడ్డిబందలు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన



రేకులషెడ్‌లోని పాఠశాలలో ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలంలోని భీరం పంచాయితీ గడ్డిబందలు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భవనం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలకు భవనం లేకపోవడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా నిర్మించిన రేకులషెడ్‌లోనే కొన్నేళ్లుగా పాఠశాలను నిర్వహిస్తూ, గిరిజన విద్యార్థులు అవస్థలు మధ్య విద్యాబోధన సాగిస్తున్న నేపథ్యంలో బుధవారం పాఠశాల వద్ద వారంతా ఆవేదన వెలిబుచ్చారు. భవనం లేక గత కొన్నేళ్లుగా చిన్న రేకుల షెడ్డులోనే పాఠశాల నడుపుతున్నారని, వర్షాకాలంలో పిల్లలు నేలపై కూర్చోడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షానికి నేలంతా బురదమయమైనప్పటికీ, అందులోనూ కూర్చుని చదవాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి, పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలని

తాగునీటి నమూనాలకు నాణ్యతా పరీక్షలు

ప్రజాశక్తి- చింతపల్లి: బోర్లు, బావుల్లోని తాగునీటి నాణ్యతపై సచివాలయ కార్యదర్శి కోరాబు శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్షలు నిర్వహించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూజారి టెండూల్కర్‌తో కలిసి చింతపల్లి-3 సచివాలయం పరిధిలోని అంతర్ల, పెంటపాడు, బుడతలవెనం తదితర గ్రామాలలో సందర్శించి త్రాగునీటి వనరుల నుంచి నమూనాలను సేకరించి నీటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ బోర్లు, బావుల్లోని నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించామన్నారు. తాగేందుకు వీలులేని బోర్లుపై హెచ్చరిక సంకేతాలు వేస్తున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బోర్లు, బావుల్లోని నీరు నాణ్యమైనదైనప్పటికీ, కాచి వడబెట్టి తాగడం ఎంతో మంచిదన్నారు. అంతేకాక అన్ని బావులు, నీటిపథకాల్లోని నీటికి వారానికోసారి క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కోపూరు విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఇ లక్ష్మి, ఆశా కార్యకర్త తూబెరి నూకరత్నం, హెల్త్ అసిస్టెంట్ సెగ్గే ప్రకాష్, అంగన్వాడి కార్యకర్త పుట్టపల్లి నాగరత్నం పాల్గొన్నారు.



కాలువల్లోని పూడికలను తీస్తున్న జెసిబి

డ్రైయినేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండల కేంద్రంలో డ్రైనేజీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, మురుగును బుధవారం స్థానిక సర్పంచ్ రాంబాబు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో తొలగించారు. డ్రైనేజి కాలువల్లో చెత్త పేరుకుని, మూసుకుపోవడంతో చిన్నపాటి వర్షానికి సైతం రోడ్లపైకి మురుగునీరు చేరి, స్తంభించడంతో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన స్థానిక సర్పంచ్ రాంబాబు సంబంధిత అధికారులు సాయం తీసుకుని కాలువల్లోని మురుగును తొలగించి, శుభ్రపరచడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దావీద్, ఎఒ వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శి రవి శాస్త్రి, చిన్నం నాయుడు, వాలంటీర్లు దొర, మూర్తి పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- పెదబయలు : మాదక ద్రవ్యాలు అనర్థాలపై స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.గ్రామాల్లో నిరుద్యోగ యువత డబ్బు సంపాదించాలనే దురాశలో తప్పుడు మార్గాలను ఎంచుకొని జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. చదువుకునేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు, పథకాలను అందిస్తోందని, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడలు, ఇతర అంశాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డిఎస్. శంకరరావు విద్యార్థులు పాల్గొన్నారు

ముగిసిన డెంగీ నివారణ మాసోత్సవాలు

ప్రజాశక్తి. -చింతపల్లి : ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్‌గా ప్రబలే కీటక జనిత డెంగీ, మలేరియా ఫైలేరియా డయేరియా, చికెన్‌గున్యా ఇతర ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్యశాఖ అదనపు అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు ప్రజల భాగస్వామ్యంతో వీటిని నివారించవచ్చన్నారు. బుధవారం ఆర్‌వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.సౌమ్య ఆధ్వర్యంలో డెంగీ నివారణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా చింతపల్లి వారపు సంతతో పాటు అంబేద్కర్ కూడలి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఆరోగ్యశాఖ సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని, డెంగీపై అవగాహనకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో చింతపల్లి, సీలేరు మలేరియా సబ్ యూనిట్ అధికారులు చిట్టిబాబు, కన్నబాబు, ఎంపిహెచ్ఇఒ జాన్సన్, ఎంపిహెచ్ఎస్ ఎస్.శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్స్ ఎస్.ప్రకాష్, కె సత్య రావు, కె.లక్ష్మణరావు, ఆరోగ్యశాఖ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో గంజాయి నిర్మూలన

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు గిరి రైతులకు ప్రోత్సాహం
- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు :గంజాయి సాగు చేసే రైతులు, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. గంజాయి సాగు వలన సమాజంపై చెడు ప్రభావం పడుతోందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, డ్వమా, డిఆర్‌డిఎ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపైసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. శాఖాధికారులు మండల స్థాయిలోను, గ్రామ స్థాయిలోను ఇంటర్ డిపార్టుమెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి సాగును నిర్మూలించి గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు అందించడానికి కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గంజాయి అంటే అందరకి అల్లూరి సీతారామ రాజు జిల్లా గుర్తుకు వస్తోందన్నారు. గంజాయిను సమూలంగా నిర్మూలించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతీ మొదటి శుక్రవారం గ్రామస్థాయిలోను, రెండవ శుక్రవారం మండల స్థాయిలోను మూడవ శుక్రవారం జిల్లా స్థాయిలోను గంజాయి నిర్మూలనా చర్యలపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. గంజాయి సాగు చేసే భూములను గుర్తించిన నివారణ చర్యలు, రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. గిరిజన రైతులకు ఉద్యాన వన పంటలను అందిస్తామన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మండలాల వారీగా గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై పక్కాగా కార్యచరణ అమలు చేయాలని అన్నారు.

డిఐజి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ 2010-12 సంవత్సరాలలో చింతపల్లి ఎఎస్పిగా విధులు నిర్వహించానని అప్పటిలో పెద్దగా గంజాయి సమస్య రాలేదన్నారు. ఇప్పుడు పెద్ద సమస్యగా మారి ,పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, ఆర్టిసి కాంప్లెక్సులు, బహిరంగా ప్రదేశాలలో గంజాయిని వినియోగిస్తున్నారని అన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలో విత్తనాలు నాటుతారని ఆయా ప్రాంతాలను గుర్తించి ఆదిలోనే అంతం చేయాలని సూచించారు. గంజాయి సాగు చేస్తే జరిగే నష్టాలను రైతులకు, యువతకు అవగాహన కల్పించి ఇతర పంటల వైపు మళ్లించాలని సూచించారు. . గత ఏడాది పది వేల ఎకరాల్లో గంజాయిని ధ్వంసం చేశామన్నారు. గత ఏడాది 3 లక్షల కేజీలు గంజాయిని దహనం వేసామని, త్వరలో మరో లక్ష కేజీల గంజాయిని దహనం చేస్తామన్నారు వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, కూంబింగ్ పోలీసులు గంజాయి పంటలను గుర్తించాన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గంజాయిని నిర్మూలన సాధ్యమన్నారు. ఉద్యాన వన పంటలు, స్ట్రాబెర్రీ, అవకాడో వంటిపంటలను రైతులకు అందించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి కమిటీలలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క ప్రత్యామ్నాయ పంటలను పరిచయం చేయాలని చెప్పారు. గిరిజన యువత ఉపాధి అవకాశాలను వదిలి పెట్టి తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారని అటువంటి యువతను గుర్తించి స్వయం ఉపాధి పథకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ధీరజ్, డిఆర్ఒ బి. పద్మావతి, డిఎఫ్ఒ వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బుంగపుట్టు డిపోకు రేషన్ బియ్యం తరలింపు

ఒడిశా మీదుగా అతికష్టం మీద డిపోకు చేరవేత
డిప్యూటీ తహశీల్దార్ అప్పలస్వామి చొరవపై ప్రశంసలు



ఒడిశా మీదుగా తరలిస్తున్న రేషన్‌బియ్యం

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: ఇంటింటికీ రేషన్‌సరుకులు పంపిణీలో భాగంగా మండలంలో అతి మారుమూల ప్రాంతమైన బుంగపుట్టు డిఆర్ డిపోకు రేషన్ బియ్యాన్ని అతికష్టం మీద బుధవారం తరలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు ఉప్పొంగడంతో ఎక్కడికక్కడే రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయి, రాకపోకలకు అవకాశం లేని పరిస్థితుల్లో మండల పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దార్ అప్పలస్వామి ప్రత్యేక చొరవ తీసుకొని, మండల కేంద్రం నుంచి సరిహద్దులో ఉన్న ఒడిశా ప్రాంతం మీదుగా సుమారు 80 కిలోమీటర్లు ప్రయాణించి, ఒడిశా మార్గంలో బుంగపుట్టు డిపోకు 145.75 క్వింటాల్ కోటా బియ్యాన్ని తరలించారు. బుంగపుట్టు డిపోలో సుమారు 554 రేషన్ కార్డుదారులు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశిత ఆదేశాల మేరకు ప్రతినెలా ఒకటో తేదీన రేషన్ బియ్యాన్ని అందించేందుకు ఇక్కడ భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేని పరిస్థితుల్లో ఒడిషా మీదుగా అతిమారుమూల గ్రామాలకు రేషన్‌బియ్యాన్ని ఎండియు వాహనాల్లో తరలించినట్లు డిటి అప్పలస్వామి తెలిపారు. సకాలంలో రేషన్ పంపిణీకి డిటి అప్పలస్వామి చొరవ, చర్యలను పలువురు ప్రశంసిస్తున్నారు.

కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి మృతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి మృతి చెందిన విషాదకర ఘటన అరకులోయ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జరిగింది. వివరాలివి. డుంబ్రిగూడ మండలం కండ్రుం పంచాయతీ గోంగూడ గ్రామానికీ వంతాల సోయిత (37) పురిటి నొప్పులు రావడంతో భర్త భగత్‌రామ్, కుటుంబసభ్యులు డుంబ్రిగూడ పిహెచ్‌సిలో చేర్పించారు. వైద్య సిబ్బంది సూచన మేరకు ఆదివారం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆదివారం కవల పిల్లలు పాప, బాబుకు జన్మనిచ్చిన సోయిత, మూడు రోజులు భాగానే ఉందని, బుధవారం మధ్యాహ్నం చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. సోయిత మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

నేరాలు ఘోరాలు

గిరిజన వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగూడ గ్రామానికి చెందిన గిరిజన వివాహిత దేవి (27) అనుమానస్పదంగా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. బల్లుగూడ గ్రామ సమీపంలోని పొదల్లో దేవి అనుమానాస్పదంగా పడి ఉండడం గమనించిన స్థానికులు ఫీడర్ అంబులెన్స్ కు సమాచారం అందించారు. పీడర్ అంబులెన్స్ హుటాహుటిన వెళ్లి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి, చికిత్స చేస్తుండగా మృతి చెందింది. సంఘటనపై స్థానిక ఎస్ఐ సంతోష్ కుమార్ దర్యాప్తు చేసున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా తరలించారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పాడేరు :అనారోగ్యంతో మృతి చెందిన సప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థి శామ్యూల్ కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించి ఆదుకుని న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. జీవన్‌కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జికె.వీధి మండలంలోని సప్పర్ల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థిని మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గూడెం కొత్తవీధి మండలం, గాలికొండ పంచాయతీ, ఎం.బూసుకొండ గ్రామానికి చెందిన శామ్యూల్ సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువు తున్నాడు.కడుపు నొప్పి, వాంతులు విరోచనాలతో అస్వస్థతకు గురై మతి చెందాడన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లు లేకపోవడం వల్లే విద్యార్థులు అత్యవసర సమయంలో వైద్యసేవలు అందని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజన ఆశ్రమాల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలని కోరారు. పిల్లలు సంఖ్యకు తగ్గట్టుగా హాస్టల్ వర్కర్లను నియమించాలని కోరారు. గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

పొలంబడిలో సాగుపై అవగాహన

ప్రజాశక్తి -జి మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ తచేరుబయలు గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పుల వలన పంటలపై ప్రభావం, సమగ్ర ఎరువుల యాజమాన్యం ఆవశ్యకతపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం. విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం, మొక్కలు నాటడం, పర్యావరణాన్ని పరిరక్షణ, భూసార పరీక్షలు వాటి ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎల్.ఆర్‌బి.పాత్రుడు సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపిఇఒ ప్రశాంత్ కుమార్, విఎఎ సత్తిబాబు,ప్రమత్స్య దేవత ఎఫ్‌పిఒ రైతులు సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో పివిటిజి గ్రామాలు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు పివిటిజి గిరిజన గ్రామాల్లో అంధకారం నెలకొంది. రెండు వారాలుగా విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో అనంతగిరి మండల పంచాయతీ డెక్కపురం, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పట్కుదౌడ గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందన విషకీటకాలు, అడవి ప్రాణుల ప్రభావం ఉందని, రాత్రివేళ విద్యుత్ లేక చీకట్లు అలుముకోవడంతో బయటకు వెళ్లాలంటే ఇబ్బందికరంగాఉందన్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, నిలిచిన విద్యుత్ పునరుద్ధించాలని ఆ గ్రామాల గిరిజనులు కోరారు

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-చింతపల్లి : వారోత్సవాల పేరుతో గిరిజన గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటే మన్యం నుంచి మావోయిస్టులను తరిమికొడతామని చింతపల్లి వారపు సంతలో గిరిజన యువకులు, వివిధ పాఠశాలలు కళాశాలల విద్యార్థులు నినదించారు.మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి సంతబయలు, పాత బస్టాండ్ కూడలి, రంగా సెంటర్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టులు స్నేహంతో అనేకమంది గిరిజనులు జైలు పాలయ్యారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్యలు, గిరిజన ప్రాంతంలో సెల్ టవర్లు, రహదారులు నిర్మిస్తున్న జెసిబిలను దగ్ధం చేసి అభివృద్ధికి అటంకం కలిగించడం వంటి మావోయిస్టుల చర్యలను ఖండించారు.


పనులను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

రహదారి నిర్మాణం వేగంగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మూలపేట పంచాయతీ బచ్చింత నుండి పాలమామిడి గ్రామం వరకు చేపట్టిన రహదారి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్టికల్ 275 (1) కింద మంజూరు చేసిన బచ్చింత నుండి ధారగడ్డ మీదగా పాలమామిడి గ్రామానికి రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రావెల్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే తారు రోడ్డు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. పాఠశాల భవన నిర్మాణానికి, తాగునీటి పథకానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డిఆర్ఎం రాజు, డిఈ చాణక్య, మూలపేట సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : విద్యా కమిటీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు, సిపిఎం నాయకులు అంపరంగి బుజ్జిబాబు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు బాధ్యతయుతంగా జరపాలే తప్ప మొక్కుబడిగా నిర్వహించడం సరికాదన్నారు. 1/3 మూడో వంతు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైతే తప్ప విద్యా కమిటీ ఎన్నికలు తూతూ మంత్రంగా జరపరాదని హితవుపలికారు. స్కూల్ కమిటీ ప్రాధాన్యతను అధికారులు తెలియజేసి అనంతరం ఎన్నికలు తెలిపితే ఎన్నికైన వారికి అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. మొక్కుబడిగా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు జరపడం వలన నిధులు పక్కదారి పట్టి సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. అందువల్ల పాఠశాలలో విద్య కమిటీలు ఏర్పాటు చేసేటప్పుడు తప్పనిసరిగా స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరారు.

పలువురికి సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన పది మందిని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం సత్కరించారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. సత్కరింపబడిన వారిలో ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు, ఎఎస్ఐలు ఆర్‌విఎస్.నారాయణ, మొహమ్మద్ జమాలుద్దిన్, కె.సూర్యనారాయణ, ఎఆర్ ఎస్ఐలు జి.ఈశ్వరరావు, కె.వెంకటేశ్వరులు, హెచ్‌సి వి.ప్రతాప్, ఎఆర్ హెచ్‌సిలు జె.వెంకటరవి, ఎస్.శంకరరావు, సిహెచ్.గోవిందరాజు ఉన్నారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సేవలందించడం గొప్ప విషయమన్నారు.

1222వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1222వ రోజుకు చేరాయి. దీక్షల్లో పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకట లక్ష్మి, కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

స్థాయీ సంఘం నామినేషన్లకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు దాఖలైన 20 మంది అభ్యర్థుల నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉన్నాయని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తవుతుందని, 7న ఎన్నికలు నిర్వహించడం, అదేరోజు ఫలితాలను వెల్లడించడం జరుగుతాయని తెలిపారు.

అంగన్వాడీల సమ్మె హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

వేతనాల పెంపు, గ్రాడ్యుటి, ఇతర డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్మికులు 42 రోజులపాటు నిర్వహించిన వీరోచిత పోరాటం సందర్భంగా గత ప్రభుత్వం మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల డిమాండ్ చేశారు. డిసెంబర్, జనవరి నెలల్లో అంగన్వాడీ కార్మికులు 42 రోజులపాటు చేసిన వీరోచిత పోరాటంపై ముద్రించిన బుక్‌లెట్‌ను మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్, నిర్మల మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రారంభమైనప్పటి నుండి డిమాండ్ల సాధకు కోసం అంగన్వాడీలు అనేక పోరాటాలు చేశారని, ఇప్పుడు 42 రోజుల పాటు చేసిన ఈ పోరాటం అంగన్వాడీ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. 11 డిమాండ్ల సాధన కోసం జరిగిన ఈ పోరాటంలో అనేక డిమాండ్లు సాధించుకోగా, మరికొన్ని డిమాండ్లపై మినిట్స్ రూపంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగుల పోరాటాల సందర్భంగా నిర్బంధం విధించిన అన్ని ప్రభుత్వాలు అధికారం కోల్పోయినట్లే వైసిపి కూడా ఇంటికి వెళ్లిందన్నారు. గత ప్రభుత్వం మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను నూతన ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు రామలక్ష్మి, మంగమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


మాట్లాడుతున్న జీవన్ కృష్ణ

ప్రజాశక్తి-సీలేరు

అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థి శామ్యూల్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అల్లూరి జిల్లా కార్యదర్శి పి.జీవన్‌కృష్ణ డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం సప్పర్ల గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. గాలికొండ పంచాయతీ ఎ.బుషికొండ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి శామ్యూల్ మృతికి గల కారణాలను సహచర విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అనేక ఆశ్రమ పాఠశాలల్లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లు నియమించకపోవడం వల్లే అనారోగ్యానికి గురైనప్పుడు విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. శామ్యూల్ వాంతులు, విరోచనాలతో మృతి చెందడం ఆయన కుటుంబానికి కడుపుకోత మిగిల్చిందని, అందువల్ల ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కొండపోడు పంటలకు నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు చోట్ల గిరిజన రైతులు సాగు చేసిన కొండపోడు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని చట్లవాడ పంచాయతీ పరిధి చట్లవాడ, ఉక్కులూరు గ్రామాల్లో గిరిజనులు కొండపోడు చేసుకొని మొక్కజొన్న, రాగులు, కందులు, సామలు వంటి చిరుధాన్యాల పంటలు వేశారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంటలు పాడైపోయాయి. వర్షపునీరు కొండ పై నుండి కిందకు ప్రవహించే క్రమంలో పంటలు కోతకు గురికావడం, మేటలు వేసేయడం, కొన్ని చోట్ల విత్తనాలు నాటకపోవడం, నాటిన చోట నేలకొరిగిపోయి నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు సిహెచ్ రత్నారెడ్డి, పి.దేవి రెడ్డి, పి.లింగారెడ్డి తెలిపారు. కొండపోడు పంటలకు నష్టం జరిగిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గిరిజన రైతు కుటుంబాలను ఆదుకోవాలని చట్లవాడ సర్పంచ్ డి ప్రేమలత, బాధిత రైతులు కోరుతున్నారు.



వర్షాలకు దెబ్బతిన్న పంట

ఆదివాసీ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నేపథ్యంలో ముందుగా రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలోని ఉన్న ఆదివాసీ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, దీనికి ముందు అన్ని గిరిజన తెగలకు చెందిన సంఘాలతో ఐటీడీఏల పరిధిలోని ఐటీడీఏ పిఒలు సమన్వయ సమావేశం నిర్వహించాలని కోరారు. సబ్ ప్లాన్ ప్రాంతాల్లో అక్కడి సబ్ కలెక్టర్లు నేతృత్వంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసి ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

వన మూలికా వైద్యం పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-చింతూరు : వన మూలికా వైద్యం సకల రోగాలను తరిమికొట్టే వజ్రాయుధమని, దాని పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట అఖిలభారత పద్మశాలి అన్నదాన సత్రంలో ఈనెల 29, 30, 31 తేదీల్లో మూడు రోజులు పాటు నిర్వహించిన సంప్రదాయ వైద్య విజ్ఞాన సదస్సు, శిక్షణ తరగతుల్లో జమాల్ ఖాన్ పాల్గొన్నారు. చివరి రోజు బుధవారం ఆయుర్వేద వైద్యుల సన్మాన అవార్డు కార్యక్రమంలో జమాల్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు నేడు ఆయుర్వేద వైద్యం వైపు చూస్తున్నాయని తెలిపారు. నేడు మితిమీరిన కలుషిత ఆహారం తీసుకుంటూ రసాయనిక పదార్థాలతో పండించిన పంటలను తింటూ రోగాలను బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయుర్వేద వనమూలిక వైద్యులకు సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పారం పర్య సంఘం నాయకులు యాత్రి మహాబుషి, ఆరూరి బాల నరసయ్య, రామంచ శ్రీనివాస్, అయితా రాజయ్య తదతరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

ఇవ్వంపల్లిలో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : వేటుకూరు పంచాయతీ, ఇవ్వంపల్లి గ్రామంలో బుధవారం మండల రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జనన/మరణ ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యూటేషన్, రేషన్ కార్డులు పొందు విధానం గురించి గ్రామసభలో తెలియజేశారు. సభలో ఒక వ్యక్తి తనకు భూమి ఎక్కువ చూపించడంతో రేషన్ కార్డు రాలేదని, రేషన్ కార్డు ఇప్పించాలని డిప్యూటీ తహశీల్దారు బాలాజీకి దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ గోపాలకృష్ణ, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్, ఆర్టికల్చర్ అధికారి వినోద్, పంచాయతీ సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా తాగునీటి ట్యాంకు నిర్మాణం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లిలోని దొరలపేటలో వీధి కుళాయిల కోసం బోరు తవ్వి, మోటారు వేసిన అధికారులు.., వాటర్ ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో స్థానికులు కరెంటు ఉన్నప్పుడు మోటర్ వేసుకుని నీళ్లు పట్టుకోవడం జరుగుతుంది. విద్యుత్ సరఫరా లేని రోజు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ మధ్యకాలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో ఎక్కడికక్కడ చెట్లు కరెంటు తీగలు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఊటగెడ్డల్లో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో కొండ వాగుల్లోకి నీళ్ల కోసం వెళితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి వీధి కులాలు ఏర్పాటు చేయాలని దొరల పేట మహిళల కోరుతున్నారు.